పేదల ఆరోగ్యానికి భరోసా

- నాడు– నేడు పథకం కింద ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి
- 104, 108తో పల్లెల్లో మెరుగైన వైద్య సేవలు
- ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో ఇంటికే వచ్చి సేవలందిస్తున్న వైద్యులు
- ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స



కొత్త ముచ్చుమర్రిలో పక్షవాత బాధితురాలు సంతోషమ్మ ఇంటికి వెళ్లి బీపీ చెక్ చేస్తున్న వైద్య బృందం

పగిడ్యాల: ఒకప్పుడు ప్రభుత్వ ఆసుపత్రులు అంటేనే ప్రజల్లో దురాభిప్రాయం ఉండేది. వైద్యులు అందుబాటులో ఉండరని సర్కారు దవాఖానాలకు వెళ్లకుండా ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగులు తీసేవారు. అయితే నేడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. పేదల ఆరోగ్యానికి జగనన్న ప్రభుత్వం ప్రాముఖ్యత ఇస్తూ గ్రామీణ స్థాయిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నాడు – నేడు పథకం కింద అభివృద్ధి చేసి అందులో ఆధునిక సౌకర్యాలను కల్పిస్తోంది. ప్రజల ముంగిటకే వైద్యులు పరుగెత్తి వైద్యం అందించేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకున్నా విప్లవాత్మకమైన నిర్ణయాలపై ప్రసంశలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే అన్ని రకాల పరీక్షలు

ఒకప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలంటే పట్టణాలకు పరుగు తీయాల్సి వచ్చేది. దీంతో వ్యయప్రసాయాసలకు లోనయ్యేవారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక స్థానిక ఆరోగ్య కేంద్రాల్లోనే వైద్య పరీక్షలు అందుబాటులోకి తెచ్చారు. రక్తపరీక్ష, ఒంటి పరీక్ష, గళ్ల పరీక్ష, హెచ్‌బీ శాతం, షుగర్, బీపీ, ప్రెగ్నెన్సి నిర్ధారణ, స్కానింగ్ తదితర పరీక్షలు గ్రామీణ ఆరోగ్య కేంద్రాల్లోనే నిర్వహిస్తున్నారు.

పెరిగిన ఓపీ

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో లభిస్తున్న 24 సేవల నేపథ్యంలో ఓపీ సంఖ్య పెరిగింది. రోజుకు ఒక్కో ఆరోగ్య కేంద్రంలో సగటును 150కి పైగా రోగులు వైద్య సేవలను పొందుతున్నారు. ఇంకా గర్భిణులకు నెల నెలా ఆరోగ్య పరీక్షలు చేసి స్టాఫ్ నర్సులు, వైద్యులు అందుబాటులో ఉండి కాన్పులు చేస్తున్నారు. ఇంకా పిల్లలకు సమయానికి ఇమ్యూనైజేషన్ కార్యక్రమాలు నిర్వహించి టీకాలు వేస్తున్నారు.

104, ఆరోగ్య శ్రీ సేవలు ప్రశంసనీయం

గత ప్రభుత్వ హయాంలో 104, 108 వాహనాలు నియోజకవర్గ కేంద్రంలోనే ఉండేవి. 104 వాహనాలు షెడ్యూల్ ప్రకారం నెలకు ఒకసారి లేదా రెండు సార్లు మాత్రమే వచ్చేవి. ఇప్పుడు మండల కేంద్రంలోనే 104 వాహనం రోగులకు అందుబాటులో ఉంది. వారంలో రెండు గ్రామాలకు వెళ్లి దీర్ఘకాలిక రోగులను చెకప్ చేసి వైద్యం అందిస్తున్నారు. ఇంకా ఈసీజీ సేవలను కూడా అందిస్తుండడం విశేషం. దీంతో పాటు ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో భాగంగా నడవలేని స్థితిలో ఉన్న రోగుల ఇళ్ల వద్దకే వైద్యులు వెళ్లి సేవలు అందిస్తున్నారు. ఆరోగ్య శ్రీ కింద కార్పొరేట్ ఆసుపత్రుల్లో చేరి మెరుగైన వైద్యం పొంది ఊపిరి నిలుపుకుంటున్నారు.

పిలిస్తే పలికే దైవం 108

ఆపదలో ఉన్న రోగులకు పిలిస్తే పలికే దైవంగా 108 వైద్య సిబ్బంది సేవలు ఉన్నాయి. గతంలో పట్టణ కేంద్రాల్లో కనిపించే 108 వాహనం ప్రస్తుతం మండల కేంద్రంలోనే ఉండి సేవలు అందిస్తున్నారు. ఫోన్ చేస్తే రెప్పపాటు కాలంలో ఆపదలో ఉన్నవారి వద్దకు చేరుకుంటోంది. టీడీపీ హయాంలో నియోజకవర్గానికి ఒకటి ఉంటే నేడు మండలానికి ఒక వాహనం ఉండడం ఎంతో మేలు జరుగుతోందని వేల సంఖ్యలో ప్రాణాలను కాపాడుతున్నారని గ్రామీణులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

మండలం	క్లస్టర్ ఆరోగ్య కేంద్రాలు	ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	ఆరోగ్య ఉప కేంద్రాలు
పాములపాడు	–	1	8
జూపాడు బంగ్లా	–	2	12
నందికొట్కూరు	1	1	10
కొత్తపల్లె	–	3	11
మిడుతూరు	1	1	4
పగిడ్యాల	–	2	11



వృద్ధురాలికి షుగర్ టెస్ట్ చేస్తున్న ఆశావర్కర్

నందికొట్కూరు నియోజకవర్గంలో ఆరోగ్య కేంద్రాల వివరాలు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	– 10
ఉప కేంద్రాలు	– 56
104 వాహనాలు	– 6
104లో రోజుకు సగటున ఓపీ	– 100
108 వాహనాలు	– 6

సిబ్బందికి కొదవ లేదు

మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, ఆరోగ్య ఉపకేంద్రాల్లో సిబ్బందికి కొదవ లేదు. గత ప్రభుత్వం కంటే ఈ ప్రభుత్వంలో సిబ్బంది నియామకం బాగా జరిగింది. ఆసుపత్రిలో అన్ని రకాల సేవలు అందిస్తున్నాం. రోజుకు 150కి పైగా ఓపి నమోదు అవుతోంది. కుక్క కాటు కేసులు అధికంగా వస్తాయి. ఒక్కొక్క టీకా ధర రూ. 1,690లు ఉంది. బాధితులకు ఉచితంగా అందజేస్తున్నాం.

– మోహన్, వైద్యాధికారి, పగిడ్యాల

అన్ని రకాల సేవలు అందిస్తున్నారు



104 వాహనం ద్వారా అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నారు. మహిళలకు రక్తహీనత ఉంటే ఐరన్ మాత్రలు ఉచితంగా ఇస్తున్నారు. గర్భ నిర్ధారణ పరీక్షలు కూడా చేస్తున్నారు. గతంలో ఇలాంటి సదుపాయాలు లేవు. 104 వాహనం కోసం ఎదురు చూసేవాళ్లం. అయినా ఇన్ని సౌకర్యాలు ఉండేవి కావు. గుండె పరీక్ష చేసే ఈసీజీ మిషన్ కూడా వాహనంలో అమర్చి పరీక్షిస్తున్నారు. వైద్య సేవలు చాలా బాగున్నాయి.

– చంద్రకళ, కొత్త ఎల్లాల

కంటి ఆపరేషన్ చేయించుకున్నాను



కళ్లు మసకబారి ఎదుటి మనిషి కనిపించేవారు కాదు. ఆరోగ్యశ్రీ కింద కర్నూలులోని సుశీల నేత్రాలయలో కంటి ఆపరేషన్ చేయించుకున్నాను. ఇప్పుడు కళ్లు బాగా కనబడుతున్నాయి. ఆరోగ్యశ్రీ మాకు అండగా నిలిచింది. అదే డబ్బుపెట్టి మేము చేయించుకోలేము. ఆరోగ్యశ్రీ కార్డు ఉంటే చాలు ఆసుపత్రిలో చేరి ఏ వైద్యమైనా ఉచింతగా చేయించుకోవచ్చు. ముఖ్యమంత్రి జగన్ మేలు మర్చిపోలేను.

– ఈశ్వరమ్మ, కొత్త ముచ్చుమర్రి

క్లుప్తంగా

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు



పూజలు నిర్వహిస్తున్న ఈఓ, అర్చకులు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైలదేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేషపూజలను దేవస్థానం ఈఓ ఎస్.లవన్న, అధికారులు, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

నకిలీ విత్తనాలు అమ్మితే శిక్షార్హులు



మాట్లాడుతున్న ఏడీఏ ఆంజనేయ

కొత్తపల్లి: పురుగుల మందులు, ఎరువుల దుకాణాలలో నాణ్యతలేని, నకిలీ విత్తనాలు అమ్మితే శిక్షార్హులవుతారని ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు బి.ఆంజనేయ హెచ్చరించారు. మండలంలోని విత్తన, పురుగు మందులు, ఎరువుల దుకాణదారులతో స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లడుతూ అనుమతి పొందిన విత్తనాలను మాత్రమే విక్రయించాలన్నారు. ఎరువులు, పురుగు మందులను ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ప్రతి విక్రయానికి బిల్లులను రైతులకు తప్పనిసరిగా అందజేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.మహేష్, డీలర్లు పాల్గొన్నారు.

సొసైటీ సీఈఓగా జంబులయ్య



నియామక పత్రాన్ని అందజేస్తున్న సొసైటీ చైర్మన్ వంగాల నాగేశ్వరరెడ్డి

వెలుగోడు: వెలుగోడు వ్యవసాయ ప్రాథమిక సహకార పరపతి సంఘం(సొసైటీ) సీఈఓగా బడిగ జంబులయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల వెలుగోడు సొసైటీ సీఈఓ సువర్ణ ఆచారి అకాల మరణం చెందడంతో ఆయన స్థానంలో సొసైటీలో పని చేస్తున్న సీనియర్ అధికారి బడిగ జంబులయ్యకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు చైర్మన్ వంగాల నాగేశ్వరరెడ్డి సీఈఓ నియామక పత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి చొరవతో సువర్ణ ఆచారి కుమారుడు జనార్ధన్ ఆచారిని క్లర్క్‌గా నియమించారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ భూమా నారాయణరెడ్డి, డైరెక్టర్లు డి. వెంకటరమణ, లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

ఎంపీటీసీ వైద్య ఖర్చులకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న వంగాల నాగేశ్వరరెడ్డి

వెలుగోడు: అబ్దుల్లాపురం ఎంపీటీసీ కనకమ్మ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయాన్ని స్థానిక నాయకులు వంగాల నాగేశ్వరరెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి రూ.20 వేల నగదును వైద్య ఖర్చుల నిమిత్తం స్థానిక నాయకుల ద్వారా అందజేశారు. ఈ మేరకు ఎంపీటీసీ కనకమ్మ ఎమ్మెల్యే శిల్పాకు కతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ సమస్యలకు సత్వర పరిష్కారం



మాట్లాడుతున్న ఏఈ ప్రభాకర్‌రెడ్డి

మహానంది: విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు సిబ్బంది కృషి చేస్తున్నారని విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గాజులపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంగణంలో గురువారం విద్యుత్ అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఏఈ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల పొలాలకు నిర్ణీత వేళల్లో నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తుందన్నారు. రైతుల పొలాలకు సంబంధించి సమస్యలుంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, 48గంటల్లో సమస్యల పరిష్కారం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చౌటుపల్లి నరసింహులు, మదాసి కురువ రిజర్వేషన్ పోరాట సమితి కన్వీనర్ గజ్జ పెద్దపక్కీరయ్య, మాజీ ఎంపీటీసీ వెంకటరమణ, రైతులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పరిశీలన పూర్తి చేయాలి



ఓటరు జాబితా వివరాలను తెలుసుకుంటున్న ఆర్డీఓ దాసు

నందికొట్కూరు రూరల్ : ఈనెల 22వ తేదీలోగా బూత్ లెవెల్ అధికారులతో ఓటరు జాబితాకు సంబంధించి డోర్‌టుడోర్ పరిశీలన ప్రక్రియను పూర్తి చేయాలని ఆత్మకూరు ఆర్డీఓ దాసు అధికారులకు సూచించారు. గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎవరైనా ఓటర్లు చనిపోయిన వారు ఉంటే అలాంటి వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించాలని సూచించారు. ఇప్పటి వరకు ఎన్నికల విధుల్లో ఉండే వారికి మాత్రమే పోస్టల్‌బ్యాలెట్ ఉండేదని ఇప్పుడు దివ్యాంగులు, 80 సంవత్సరాలు పైబడిన వారందరికీ పోస్టల్ బ్యాలెట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. బూత్‌లెవెల్ అధికారులు కనీసం రోజుకు 30 నుంచి 40 ఇళ్ల తనిఖీలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజశేఖర్‌బాబు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ కిషోర్, భూ సర్వే తహసీల్దార్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే చర్యలు

మిడుతూరు: గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, చట్టరీత్యా చర్యలు తప్పవని ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు హెచ్చరించారు. గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు.ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ప్రశాంత జీవనం గడపడంతో పాటు, సోదర భావం పెంపొందించుకోవాలని సూచించారు. అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. నాటుసారా, పేకాట స్థావరాలపై ప్రత్యేక దృష్టి సారించి ఉక్కుపాదం మోపాలని సూచించారు. వీపనగండ్ల గ్రామంలో ఓ సామాజిక వర్గానికి మధ్య రస్తావివాదంపై గ్రామంలో పీస్‌ఫుల్ కమిటీ ఏర్పాటు చేసి వారికి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం తాటిపాటి రవి పురుగులమందు సేవించి ఆత్మహత్య యత్నానికి పాల్పడిన విషయంపై ఆరా తీశారు. కార్యక్రమంలో రూరల్ సీఐ సుధాకర్ రెడ్డి, ఎస్‌ఐ మారుతీ శంకర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

324 మంది రైతుల పత్రాలు పరిశీలన

కొత్తపల్లి: మండలంలో ఆయా గ్రామాలలో శ్రీశైలం ప్రాజెక్ట్ నిర్మాణ సమయంలో భూములు కొల్పోయిన 324 మంది రైతుల పత్రాలు పరిశీలిన చేసినట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ పెద్దన్న తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయం డిప్యూటీ తహసీల్దార్లు శ్రీరాధ, విజయలక్ష్మి, రాజారావులు పత్రాలను పరిశీలన చేశారు. వారు మాట్లాడుతూ మండలంలోని గోకవరం గ్రామంలో 255 మందికి గాను 128 పత్రాలు పరిశీలన చేశామని 127 మందివి చేయాల్సి ఉందన్నారు. అదేవిదంగా ముసలిమడుగు గ్రామంలో 68 మంది రైతులు ఉండగా 36, గుమ్మడాపురం గ్రామంలో 30 గాను 20 మంది పత్రాలు పరిశీలించామని ఇంకా 10 మంది వివరాలు తెలియాల్సి ఉందన్నారు. ఎదురుపాడు గ్రామంలో 208 మంది రైతులు ఉండగా 140 మంది రైతుల వివరాలు పరిశీలించామని 68 మంది వివరాలు సేకరించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్లు రాజేశ్వరి, రాధమ్మ, వీఆర్వోలు బాబుమియా, రామసుబ్బయ్య, అశోక్, రహీం తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

నేడు మాసశివరాత్రి వేడుకలు

మహానంది: జిల్లాలోని ఏకైక నవగ్రహాల ఆలయమైన గాజులపల్లె రైల్వేస్టేషన్‌లో వెలిసిన శ్రీ గంగా, గౌరీసమేత మరకతలింగేశ్వర, నవగ్రహాల దేవాలయాల్లో శుక్రవారం మాసశివరాత్రి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు కనమర్లపూడి మస్తాన్‌రావు తెలిపారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామంలో ఇటీవల గుండెనొప్పితో మృతి చెందిన శ్రీరాములు కుటుంబానికి వైఎస్‌ఆర్ బీమా నగదును గురువారం సర్పంచు వరప్రసాద్ అందజేశారు. ప్రస్తుతం రూ.10వేలు అందజేశామని, మిగతా మొత్తాన్ని నామినీ బ్యాంకు ఖాతలో జమ అవుతాయని చెప్పారు.

దిశ యాప్‌ను వినియోగించుకోవాలి

కొత్తపల్లి: మహిళ రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం దిశ యాప్‌ను ప్రవేశపెట్టిందని, ప్రతి ఒక్కరూ దీనిని వినియోగించుకోవాలని ఎస్‌ఐ హుస్సేన్‌బాషా సూచించారు. మండల కేంద్రంలో గురువారం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు.

ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి

పాములపాడు: ఇప్పటి వరకు రైతు భరోసా బ్యాంకులో జమ కాని రైతులు ఆధార్ అప్‌డేట్ చేసుకుంటేనే నగదు జమ అవుతుందని మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి అన్నారు. గురువారం స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో ఆర్బీకే సిబ్బందిచే సమావేశం నిర్వహించారు.

ఆకు, కాయగూరలతో కంటిచూపు పదిలం

మహానంది: తక్కువ ఖర్చుతో లభించే ఆకు, కాయగూరలు తినడం ద్వారా కంటిచూపును కాపాడుకోవచ్చని జిల్లా అంధత్వ నివారణ అధికారిణి డాక్టర్ మాధవీలత తెలిపారు. గాజులపల్లె ఆరోగ్య కేంద్రంలో గురువారం డాక్టర్ వైఎస్సార్ కంటివెలుగు పథకంలో భాగంగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు.

కోర్టు చలానాల వసూలు

కొత్తపల్లి: మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో కోర్టు ద్వారా వచ్చిన నోటీసుల ఆధారంగా ఏపీ ట్రాన్స్‌కో కర్నూలు డివిజన్ విజిలెన్స్ హెడ్‌కానిస్టేబుల్ షేక్‌వుల్లాఖాన్ ఏపీ ట్రాన్స్‌కో కర్నూలు డివిజన్ విజిలెన్స్ హెడ్‌కానిస్టేబుల్ షేక్‌వుల్లాఖాన్ చలానాల వసూలు కార్యక్రమం నిర్వహించారు. అక్రమంగా కనెక్షన్లు తీసుకున్న 14 మందికి కోర్టుద్వారా చలనాలు రాగా, 13 కేసుల వద్ద నుంచి రూ.20,546 వసూలు చేశారు.

విద్యావంతులుగా తీర్చిదిద్దడమే ధ్యేయం



విద్యాకానుక అందుకున్న విద్యార్థులతో జెడ్పీటీసీ

జూపాడుబంగ్లా: ప్రతి పేద విద్యార్థికి కార్పొరేట్ స్థాయిలో ఆంగ్లమాధ్యమ విద్యను అందించి విద్యావంతుడిగా తీర్చిదిద్దటమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి, ఎంపీటీసీ నీలమ్మ, వైస్ సర్పంచ్ శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పారుమంచాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ విజయ్‌కుమార్, పీఎంసీ చైర్మన్ ప్రమీల, నాగరత్నం, రాము తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

పాములపాడు: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు అని సర్పంచు వరప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని తుమ్మలూరు గ్రామంలో ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి





పదిలో నియోజకవర్గ టాపర్ షబ్రీన్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారుఫ్, నందికొట్కూరులో విద్యార్థులతో అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆత్మకూరు/ఆత్మకూరురూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మున్సిపల్ చైర్మన్ ఆసియా మారుఫ్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల అవరణలో గురువారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పేదరికంతో విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించ లేకపోయారని రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పేద విద్యార్థులు ఉన్నత స్థాయి చేరవేయాలనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. అనంతరం పది, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి పరమేశ్వరి, పాఠశాల హెచ్‌ఎం షహీనజా, శ్రీనివాసులు, వెంకటస్వామి, ఎంఈఓ జానకీరామ్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాఘురామాచార్యులు, ఎంపీడీఓ మోహన్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు రాజగోపాల్, కౌన్సిలర్ విజయకుమార్, పీఎంసీ చైర్మన్ వరాల మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం నియోజకవర్గ టాపర్ సుమలతకు సత్కారం

మహానంది: బండిఆత్మకూరు మోడల్‌స్కూల్‌లో ఇంటర్ చదువుతూ ఫలితాల్లో శ్రీశైలం నియోజకవర్గ టాపర్‌గా నిలిచిన కుసుమ సుమలతను గురువారం అధికారులు నగదు బహుమతి, ప్రశంసా పత్రంతో సత్కరించారు. ఇంటర్ పరీక్షా ఫలితాల్లో 971 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది.





విద్యార్థిని నందిని, ఆమె తండ్రి రామకృష్ణను సన్మానిస్తున్న దృశ్యం, సర్టిఫికెట్, సత్కారం పొందిన సుమలత

'ఆణిముత్యాల'కు సత్కారం

నందికొట్కూరు : పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మండల విద్యాధికారి ఫైజున్నిసా అధ్యక్షతన గురువారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను సన్మానించారు. వారికి నగదు బహుమతులతో పాటు మెమెంటో, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ రాజశేఖర్‌బాబు, ఎంపీడీవో శోభారాణి, ఉపాధ్యాయులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సత్తాచాటిన మోడల్ విద్యార్థిని

జూపాడుబంగ్లా: ఇంటర్మీయెట్ వార్షిక పరీక్షల్లో వెయ్యికి 966 మార్కులు సాధించి జూపాడుబంగ్లా మోడల్ స్కూల్ విద్యార్థిని కంసలి నందిని నియోజకవర్గ స్థాయిలో సత్తాచాటింది. గురువారం నందికొట్కూరులో జరిగిన జగనన్న ఆణిముత్యాల కార్యక్రమంలో ఆమెను సన్మానించారు. ఎంపీపీ సువర్ణమ్మ, ప్రిన్సిపాల్ రమేష్, ఎంఈఓ తిమ్మారెడి పాల్గొన్నారు.

గిరిజన యువకుడి అనుమానాస్పద మృతి

మహానంది: బండిఆత్మకూరు మండలం బరకలకాలనీకి చెందిన గిరిజన యువకుడు గుల్ల నాగన్న(25) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్‌ఐ బాబు తెలిపిన వివరాల మేరకు... నారాయణాపురం మజరా గ్రామమైన బరకలకాలనీకి చెందిన నాగన్నకు కొన్నేళ్ల క్రితం వివాహం కాగా భార్య ప్రస్తుతం తన వద్ద లేదు. వీరికి ఓ కుమారుడు ఉన్నాడు. ఇదిలా ఉండగా సమీపంలోని పంటపొలాల్లో నాగన్న మృతి చెందిన విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి ముఖానికి గాయాలు ఉన్నట్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

ప్రేమించమంటూ వేధించిన వ్యక్తిపై కేసు నమోదు

మహానంది: నన్ను ప్రేమించమంటూ వేధిస్తూ, చంపుతానని ఓ బాలికను బెదిరించిన ఘటనలో గురువారం ఒకరిపై కేసు నమోదు చేసినట్లు బండిఆత్మకూరు ఎస్‌ఐ బాబు తెలిపారు. లింగాపురం గ్రామానికి చెందిన మౌలాలి ఓ బాలికను కొన్నేళ్లుగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడన్నారు. ప్రేమించకపోతే చంపేస్తానంటూ బెదిరించేవాడని బాధితురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు మౌలాలిపై 354డీ, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ విషయంపై నంద్యాలకు వచ్చిన డీఐజీ సెంథిల్‌కుమార్ వివరాలు అడిగితెలుసుకున్నట్లు తెలిసింది.

బీమా పరిహారం అందజేత

మహానంది: కర్ణాటకలోని దర్గా వద్దకు వెళ్తూ మార్గమధ్యంలో ప్రమాదానికి గురై మృతి చెందిన బండిఆత్మకూరుకు చెందిన బాధిత కుటుంబ సభ్యులకు బీమా పరిహారంలో భాగంగా ముందస్తుగా గురువారం రూ.50వేలు ఆర్థిక సాయం అందించారు. శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆదేశాల మేరకు మాజీ ఎంపీపీ దేసు వెంకట్రామిరెడ్డి, సొసైటీ చైర్మన్ శివలింగం, ఉపసర్పంచ్ అవుటాల నాగేశ్వరరెడ్డి, న్యాయవాది సుబ్బరాయుడు గ్రామంలోని మునీర్ కుటుంబ సభ్యులకు నగదు అందించారు.

ట్రాక్టర్ ట్రాలీని ఢీకొని .. యువకుడి దుర్మరణం

మిడుతూరు: రహదారి పక్కన ఉంచిన ట్రాక్టర్ ట్రాలీని ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఓ యువకుడు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు నందికొట్కూరు పట్టణం కోటావీధికి చెందిన మంగళి వేణుగోపాల్ అలియాస్(గోపి) (30) బైక్‌పై సొంత పనుల నిమిత్తం నంద్యాలకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ఈ ప్రమాదం జరిగింది. తలముడిపి – రోళ్లపాడు గ్రామాల మధ్యలో తెలుగుగంగ కాలువ సమీపంలో ఓ ట్రాక్టర్ ట్రాలీ పంక్చర్ కావడంతో రహదారి పక్కన నిలిపివేశారు. బైక్‌పై వస్తున్న మంగళి వేణుగోపాల్ ట్రాక్టర్ ట్రాలీని ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు కంప్యూటర్ హార్డ్‌వేర్ రిపేర్ చేసుకుంటూ జీవనం గడుపుతున్నాడు. మృతునికి భార్య అలేఖియ, సంవత్సరం కూతురు వేదశ్రీ, తల్లి మాధవి ఉన్నారు. భార్య అలేఖియ గర్భిణి అని సమాచారం. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఘటనపై ఆరా తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టరు నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఏఎస్‌ఐ సుబ్బయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఆత్మకూరురూరల్: మండలంలోని కరివేన శివారులో ఉన్న ఎస్‌ఆర్‌బీసీ కాలనీ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇస్మాయిల్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పాములపాడుకు చెందిన ఇస్మాయిల్ ద్విచక్రవాహనంలో ఆత్మకూరుకు వస్తుండగా ఎంపీడీ కార్యాలయం వద్ద కర్నూలు వైపు వెళ్తున్న ఏపీ39 యుజె8786 నంబరుగల ఆర్టీసీ బస్సును ఢీకొన్నాడు. దీంతో ఇస్మాయిల్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదంలో ఇస్మాయిల్ కాలు విరిగింది. ఆత్మకూరు పోలీసులు ఇస్మాయిల్‌ను ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స జరిపి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తీసుకు వెళ్లవలసిందిగా ఆసుపత్రి వర్గాలు సూచించాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చెంచుకాలనీ సందర్శన

మహానంది: అబ్బీపురం గ్రామంలోని చెంచుకాలనీని ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి, తహసీల్దార్ జనార్దన్‌శెట్టి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివనాగజ్యోతి గురువారం సందర్శించారు. స్థానిక చెంచులు వెంకటేశ్వర్లు, తదితరులు ఇటీవల స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌ను కలిసి మౌలిక వసతులు కల్పించాలని వినతిపత్రం అందించారు. శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సైతం కలెక్టర్‌తో మాట్లాడారు. వారి ఆదేశాల మేరకు అధికారులు కాలనీకి చేరుకుని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తమను ఐటీడీఏలో చేర్చాలని, ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలని అధికారులకు చెంచులు విన్నవించారు. తాగునీరు, రోడ్లు, విద్యుత్, ఇతర సౌకర్యాల కల్పనకు ప్రతిపాదనలు తయారు చేసి నివేదికలు పంపించాలని పీఓ రవీంద్రారెడ్డి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహామండలి చైర్మన్ శరభారెడ్డి, ఏపీఓ మురళీ, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారానికి భాగస్వాములు కావాలి

వెలుగోడు: సొంతింటి కల సాకారానికి గిరిజనులు కూడా భాగస్వాములు కావాలని గిరిజన సమీకృత అభివృద్ధి సంస్థ శ్రీశైలం ప్రాజెక్ట్ డైరెక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి చొరవతో గురువారం డిగ్రీ కాలేజీ సమీపంలోని విజయదుర్గ చెంచుకాలనీ–2లో గిరిజనులతో ఐటీడీఏ, ఆర్డీటీ, హౌసింగ్ అధికారులు సమావేశమయ్యారు. ఈ కాలనీలో గతంలో 56 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు. మూడేళ్లు అవుతున్నా చెంచులు ఇంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో అధికారులు సమావేశం నిర్వహించి వారిని చైతన్యవంతం చేశారు. ఆర్డీటీ సంస్థ ద్వారా వారికి ఇల్లు కట్టించడానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు రవీంద్రారెడ్డి చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ పుష్పలత, హౌసింగ్ డీఈఈ ఉమా మహేశ్వరరావు, ఐటీడీఏ జిల్లా ప్రత్యేక అధికారి కేజీ నాయక్, ఎంపీపీ లాలం రమేష్ తదితరులు పాల్గొన్నారు.



చెంచులతో మాట్లాడుతున్న పీఓ, అధికారులు